*

# ఇదీ దారి

శ్రీ శ్రీ, ఆరుద్ర

తెనుగు నదుల నీళ్లలాగ
మనలోగల ఉత్సాహం
నిర్మాణాత్మక శక్తుల
నిర్వహణం లేనందున
ఉప్పునీటి కడలిలోకి
ఊరక ప్రవహించిపోయె;
అందరాని చందమామ
యందలి కుందేటికొమ్ము
సాధించే యత్నంగా
సాగించే ఉద్యమాల
ఆర్భాటం ఆపేద్దాం!
సంరంభం చాలిద్దాం!
పదిమందీ కలిసి కూడ
బలుక్కునే పరిషత్తున
ఎవడో ఒకడే నిలబడి
ఎల్లరికీ అడ్డంపడి
అల్లరికే దారితీసి
అందరికీ హానిచేసి
నియంతృత్వ ధోరణిలో
నిజంమీద ముసుగుకప్పి
తనదారిని తాబోతే
మనరాష్ట్రం వస్తుందా?
ఆచరణకు కాకుంటే
అసలొక తీర్మానమేల?
కాపుర మిష్టంలేందే
కల్యాణం ఎందుకొరకు?
సోడాపొంగును పోలిన
శుష్కావేశాలెందుకు?
తాడూ బొంగరములేని
దండుగ పథకాలెందుకు?
తాతలు నేతులు తాగిన
పాత కథలు తవ్వనేల
చారడేసి కళ్లైనా
శవంవల్ల ఏంలాభం?
తెలుగునేల వికసించే
తెరువేదో వెదకొద్దా?
తెలుగుకోర్కె ఫలియించే
తెరగేదో చూడొద్దా?
చిటికి మాటికి వచ్చే
కాటకాల మాటేమిటి?
కూటిని గూటిని చూపే
సూటియైన బాటేమిటి?
అన్నలార! తమ్ములార!
అఖిలాంధ్ర జనమ్ములార!
ఆవేశాలొదిలిపెట్టి
ఆలోచించండి మీరు!
పాతవి నెమరేసుకొనే
తాతలు మన నాయకులా?
నూతన మార్గం చూపే
నేతలు లేనేలేరా?
చేతికందనున్న ఫలము
గోతిపాలు కావాలా?
మదరాసుకు ముడివేసుకు
మనరాష్ట్రం పోవాలా?
మొదటి పనులు మొదటచేసి
తదుపరి సంగతి చూదాం!
మనదేదో మనకొస్తే
మడిమాన్యాలొచ్చినట్టు!
విరోధాలు రాకుండా
వివాదాలు లేకుండా
సత్వరమే మనరాష్ట్రం
సాధించడమే శ్రేష్ఠం!
మొట్టమొదటి మెట్టుమీద
గట్టిగ కాలూని, పిదప
చిట్టచివరిదాకా మన
పట్టుదలను సాగిద్దాం!
మూడుకోట్ల జనం మనం,
ముమ్మాటికి గెలవగలం!
సాటిలేని తెలుగుబలం
మేటిదనుచు చాటగలం!
చీల్చబడిన పరగణాలు
చేర్చి ఒకటి చేయువరకు
విశాలాంధ్ర వచ్చువరకు
విరామమే లేదు మనకు!